విద్యుత్ సమస్యలకు స్వస్తి!

- షాద్‌నగర్‌కు 79 ట్రాన్స్‌ఫార్మర్లు, 798 స్తంభాలు మంజూరు
- 32 కిలోమీటర్ల కండక్టర్ వైర్, 74.2 కిలోమీటర్ల కేబుల్ వైర్లు
- తీరనున్న రైతులు, ప్రజల సమస్యలు



షాద్‌నగర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్

షాద్‌నగర్: ఈదురుగాలులు, వర్షాలతో విద్యుత్ వినియోగదారులు తరచూ ఇబ్బందులు పడుతున్నారు.. లోఓల్టేజీతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.. సరైన సామగ్రి లేకపోవడంతో విద్యుత్ అధికారులు సమస్య పరిష్కారానికి అవస్థలు ఎదుర్కొంటున్నారు.. ఈ సమస్యలు త్వరలో తొలగనున్నాయి. విద్యుత్ వెలుగులు విరజిమ్మనున్నాయి. సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన ప్రయత్నం ఫలించింది. నియోజకవర్గానికి పెద్దఎత్తున విద్యుత్ సామగ్రితో పాటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయి.

ఇవీ సమస్యలు

షాద్‌నగర్ మున్సిపాలిటీలతో పాటుగా కొత్తూరు, కొందుర్గు, కేశంపేట, షాద్‌నగర్‌రూరల్, చౌదరిగూడ, నందిగామ మండలాల పరిధిలో గత కొంతకాలంగా విద్యుత్ సమస్యలతో గృహ వినియోగదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే లోఓల్టేజీ సమస్య, వర్షాలు కురిస్తే తరచూ విద్యుత్ వైర్లు తెగిపోవడం, ఏబీ స్విచ్‌లు పాడవటం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో విద్యుత్ సిబ్బందికి తలనొప్పిగా మారేది. అదేవిధంగా గ్రామాలు, పట్టణం విస్తరిస్తుండటంతో దానికి అనుగుణంగా విద్యుత్ స్తంభాలు, వైర్లు లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

సమస్యలను గుర్తించి..

క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇటీవల షాద్‌నగర్ పట్టణంతో పాటుగా వివిధ గ్రామాల్లో పర్యటించారు. చాలా మంది లోఓల్టేజీ, విద్యుత్ స్తంభాలు, వైర్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్‌శాఖ అధికారులతో ఇటీవల సమావేశాన్ని నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం కావాల్సిన సదుపాయాలను తెలుసుకొని నివేదికను రూపొందించారు. ఈ విషయమై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పలుమార్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, విద్యుత్ శాఖ సీఎండీ ముషారఫ్ ఫరూఖ్ అలీ దృష్టికి తీసుకెళ్లారు.

మంజూరు ఇలా..

నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం పెద్దఎత్తున మెటీరియల్‌ను మంజూరు చేసింది. వ్యవసాయ రంగానికి కావాల్సిన 79 ట్రాన్స్‌ఫార్మర్లు, 32,300 మీటర్ల (32 కిలోమీటర్లు) కండక్టర్ వైర్, 74,021 మీటర్ల (74 కిలోమీటర్లు) కేబుల్ వైర్, 798 విద్యుత్ స్తంభాలు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



విద్యుత్ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాం. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించాం. దానికి అనుగుణంగా ప్రభుత్వం నుంచి విద్యుత్ సామగ్రిని మంజూరు చేయించాను.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

పనుల్లో నాణ్యత తప్పనిసరి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కాంట్రాక్టర్లకు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని 11, 12, 13, 14 వార్డుల్లో జరుగుతున్న పనులను మంగళవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఉన్నత పాఠశాల వరకు నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ఆయన పరిశీలించారు. అదేవిధంగా ఆయా కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, తాగునీటి సమస్యలు ఉన్నాయని పలువురు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వారికి హామీనిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అంతర్గత రహదారులు, విద్యుత్ సమస్యలు, డ్రైనేజీ వంటి తదితర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు స్పష్టం చేశారు. ఫరూఖ్‌నగర్‌లో గాంధీ విగ్రహానికి నూతన దిమ్మెను నిర్మించాలని నాయకులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, జమ్రుద్‌ఖాన్, అందె మోహన్, ముబాకర్, ఇబ్రహీం, ఖదీర్, బీరప్ప, సాయి, జయప్రకాశ్, లింగం పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిరండి

యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు దళపతి గౌడ్

మాడ్గుల: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను ఆమోదించాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీసీ బిల్లు ఆమోదం కోసం బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే మహాధర్నాకు బీసీలంతా కదిలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, పురుషోత్తం రెడ్డి, సయ్యద్ సలీం, నాగరాజు, వెంకటేశ్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఏపీఎం భగవంతు



సంఘం సభ్యులతో మాట్లాడుతున్న ఏపీఎం భగవంతు

నందిగామ: మహిళా సంఘాల సభ్యులు బ్యాంకులు ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలని ఏపీఎం భగవంతు సూచించారు. మండల పరిధిలోని జంగోనిగూడలో మంగళవారం గ్రామ మహిళా సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. సంఘం సభ్యులు న్యూ ఎంటర్‌ప్రైజెస్ యూనిట్లు, బ్యాంకు లింకేజీ కింద రుణాలు తీసుకొని వాటర్ ఫిల్టర్ నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. గ్రామంలో 10 సంఘాలు ఉన్నాయని, వాటికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, పొదుపులు, అప్పులు, పుస్తకాల నిర్వహణ తదితర విషయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోనే జంగోనిగూడ సంఘం ఆదర్శంగా ఉందని కొనియాడారు. కార్యక్రమంలో సీసీ అనురాధ, గ్రామ సంఘం అధ్యక్షురాలు ఊర్మిళ, కార్యదర్శి సత్యమ్మ, కోశాధికారి హేమలత, రాధిక, పలువురు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం

టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న గౌరీ సతీష్, భీమ్‌భరత్

మొయినాబాద్‌రూరల్: సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరమని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీమ్‌భరత్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధి హిమాయత్‌నగర్ పద్మావతి కాలనీలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన 7 మంది లబ్ధిదారులకు 3,48,500 రూపాయల చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పేదవారికి వరం లాంటిదన్నారు. నియోజకవర్గంలో వందలాది మంది పేదలకు వైద్యసేవల కోసం సీఎం సహాయ నిధి ద్వారా చెక్కులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకుల వద్ద అపరిశుభ్రత



వాటర్ ట్యాంకుల వద్ద నిలిచిన నీరు

చేవెళ్ల: వర్షాకాలం వ్యాధుల కాలం కావటంతో గ్రామాల్లో ప్రజలు పరిశుభ్రత పాటించాలని అధికారులు సూచిస్తుంటారు. కానీ నిత్యం నీటి సరఫరా చేసే వాటర్ ట్యాంకుల వద్ద అపరిశుభ్రత పేరుకుపోవటంతో స్థానిక ఇళ్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఊరేళ్ల వార్డులో గల ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులు ఉన్నాయి. రెండు వాటర్ ట్యాంకులు, ఒక సంపు ఒకేచోట ఉండటంతో ప్రతిరోజు పైపులైన్‌లలో ఓవర్ ఫ్లో వాటర్ అంతా అక్కడే చేరి నిల్వ ఉంటున్నాయి. నీరు వెళ్లే దారి లేక ఆ ప్రాంతం అంతా అపరిశుభ్రంగా మారుతోంది. నీరు నిల్వ ఉండడంతో అక్కడ నుంచి దోమలు ఇళ్లలోకి వస్తున్నాయని వాపోతున్నారు. దీనికి తోడు పాఠశాల ఆవరణలోనే ఉండడంతో విద్యార్థులకు సైతం వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, మున్సిపల్ అధికారులు స్పందించి ట్యాంకర్ల వద్ద నీటిని తొలగించి శుభ్రం చేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

ఆర్‌ఎంపీ క్లినిక్‌లలో తనిఖీలు



క్లినిక్‌ని తనిఖీ చేస్తున్న వైద్యాధికారి రేవతిరెడ్డి

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలోని ఆర్‌ఎంపీ క్లినిక్‌లను శంకర్‌పల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రేవతిరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రబాబు సూచన మేరకు క్లినిక్‌లపై ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. ఆర్‌ఎంపీలు ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే పనిచేయాలని, క్లినిక్‌లలో బెడ్స్ వేసి, రోజుల తరబడి వైద్యం అందించొద్దని సూచించారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భారీ వర్షం.. రోడ్లన్నీ జలమయం



మొయినాబాద్‌లో కురుస్తున్న వర్షం

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. పట్టణంతో పాటు చిలుకూరు, పెద్దమంగళారం, సురంగల్, ముర్తూజగూడ, ఎనికేపల్లి, హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్ ప్రాంతాల్లో భారీగా వర్షం పడింది. సాయంత్రం సమయంలో వర్షం పడటంతో ఇళ్లకు వెళ్లేవారు ఇబ్బందులు పడ్డారు. మొయినాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో, హిమాయత్‌నగర్ చౌరస్తా, అజీజ్‌నగర్ చౌరస్తాల్లో రోడ్లపై వర్షం నీరు భారీగా నిలిచింది. దీంతో కొంతసేపు వాహనదారులు అవస్థలు పడ్డారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు

షాద్‌నగర్: పట్టణంలోని శివమారుతీ గీతా అయ్యప్ప మందిరం ఆవరణలో మంగళవారం 13 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు, అర్చకుడు రవిశర్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం



జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

కడ్తాల్: అమలుకు నోచుకోని హామీలతో అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాయంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన గుర్క శ్రీకాంత్ యాదవ్, బాలకృష్ణ, మధు, మహేశ్, గణేశ్, లింగం, సురేశ్, రమేశ్, మహేశ్, మల్లేశ్, మధు, శ్రీరాములు, వంశీ, శ్రీకాంత్, ధనుంజయ్, ఆంజనేయులు, నాగరాజు, మహేశ్ తదితరులు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను చూసి స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, కృష్ణయాదవ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు ప్రవీణ్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్, శివయాదవ్, నర్సింహ, జైపాల్‌రెడ్డి, రమేశ్, రాములు, వెంకటేశ్, శ్రీకాంత్, చరణ్, భిక్షపతి, మహేశ్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ హాస్టల్‌ను ప్రారంభించాలి

తహసీల్దార్ కృష్ణయ్యకు ఏబీవీపీ నాయకుల వినతి



తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేవెళ్ల: బాలికలకు చేవెళ్లలో సంక్షేమ హాస్టల్ లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే హాస్టల్ ఏర్పాటు చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుర్వ మహిపాల్ మాట్లాడుతూ.. కళాశాలల్లో చదువుకునే బాలికలకు అందుబాటులో సంక్షేమ హాస్టల్ లేని కారణంగా చదువుకు దూరం అవుతున్నారన్నారు. గతంలోనే చేవెళ్లకు బాలికల సంక్షేమ హాస్టల్ మంజూరైన కొన్ని రోజులు అద్దె భవనంలో కొనసాగించి.. అ తర్వాత పాఠశాల వసతి గృహంలో కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది కళాశాల విద్యార్థులకు సరైన వసతి సౌకర్యం లేకపోవటంతో అడ్మిషన్లు కూడా చేసుకోలేదన్నారు. దీంతో విద్యార్థులు కళాశాలల్లో చదువుకునేందుకు ఇళ్ల నుంచి రావాల్సి వస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చేవెళ్లకు మంజూరైనా సంక్షేమ హాస్టల్‌ను వెంటనే ప్రారంభించి నూతన భవనం నిర్మించాలని కోరారు. ప్రస్తుతం అద్దె భవనంలో అయినా విద్యార్థులకు వసతి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జైపాల్, మల్లేశ్, మరికృష్ణ, ఆకాశ్, వెంకటేశ్, నరేశ్ తదితరులు ఉన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం



కొందుర్గు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ జ్యోత్స్న



కేశంపేట: తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న సూపర్‌వైజర్ శమంతకమణి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న

కొందుర్గు: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని, పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అమృత జోసెఫ్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ అధికారులు గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు విధిగా పోషకాహారం తీసుకోవాలన్నారు. ప్రతినిత్యం ఆకుకూరలు, కూరగాయలు, పాలు, పండ్లు, గుడ్లు తీసుకోవాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పంపిణీ చేసే పోషకాహారం తీసుకోవాలని కోరారు. అనంతరం డాక్టర్ అమృత జోసెఫ్ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలకు విధిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భాగ్యమ్మ, రజియా, మాణమ్మ, శ్రీలత, హేమలత, నాగమణి, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

సంగెంలో..

కేశంపేట: మండల పరిధిలోని సంగెంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ కొత్తపేట సెక్టార్ సూపర్‌వైజర్ శమంతకమణి, అంగన్‌వాడీ టీచర్లు శశికళ, శివలీల, గ్రామస్తులు మానస, జ్యోతి, వాణి, మౌనిక, స్వాతి, నజీమా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా?



గుంతలమయంగా నందిగామ-వీర్లపల్లి రోడ్డు

నందిగామ: మండల కేంద్రమైన నందిగామ నుంచి వీర్లపల్లికి వెళ్లే రహదారిలో అప్పారెడ్డిగూడ, నందిగామ శివార్ల మధ్య రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతినడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అప్పారెడ్డిగూడ, నందిగామ శివార్లలో వాగు ఉంది. ఈ వాగు ఇటీవల కురిసిన వర్షాలకు వాగు పొంగి పొర్లడంతో ఆ రహదారిలో వాహనాల రాకపోకలు కొన్ని రోజులుగా నిలిచిపోయాయి. ఇటీవల వాగు ఉధృతి తగ్గడంతో మళ్లీ రాకపోకలు కొనసాగుతున్నాయి. వాగు ఉధృతికి మట్టి కొట్టుకుపోవడంతో రోడ్డంతా గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు కాకుండా వీర్లపల్లికి వెళ్లాలంటే సుమారు 3 కిలోమీటర్లు అదనంగా చంద్రాయన్‌గూడ చౌరస్తా, అప్పారెడ్డిగూడ మీదుగా వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అధికారులు స్పందించి ఇప్పటికైనా రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులైన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మూతబడిన అంగన్‌వాడీ కేంద్రాలు

- భర్తీకి నోచుకోని టీచర్లు, ఆయా పోస్టులు
- చిన్నారులు విద్యాబుద్ధులకు దూరం
- లబ్ధిదారులకు అందని పౌష్టికాహారం
- కొన్ని కేంద్రాల బాధ్యతలు ఇన్‌చార్జీలకు అప్పగింత



ఎత్‌మార్‌పల్లిలో తాళం వేసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

మొయినాబాద్‌రూరల్: మహిళా, శిశు సంరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్, ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆయా కేంద్రాల పరిధిలోని బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తారో అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

రెండు సెక్టార్లు..

మొయినాబాద్ మండలం, మున్సిపల్‌లో మొత్తం 58 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 58 కేంద్రాలను రెండు సెక్టార్లుగా విభజించి ఇద్దరు సూపర్‌వైజర్‌లు పర్యవేక్షణ చేస్తున్నారు. రెండు సెక్టార్లల్లో ఒకటి హిమాయత్‌నగర్, మొయినాబాద్‌లో ఉన్నాయి. ఇందులో మొయినాబాద్ సెక్టార్ పరిధిలోని ఎత్‌మార్‌పల్లిలో గల అంగన్‌వాడీ సెంటర్ దాదాపు మూడు సంవత్సరాల నుంచి అంగన్‌వాడీ టీచర్ లేకపోవడంతో అప్పట్లో కొంతకాలం ఆ గ్రామ అప్పటి సర్పంచ్ సొంత డబ్బులతో ప్రైవేటు టీచర్‌ను ఏర్పాటు చేసి నడిపించారు. సర్పంచ్ పదవీ కాలం ముగియడంతో అంగన్‌వాడీ సెంటర్ మూడు సంవత్సరాల నుంచి మూతబడింది. హిమాయత్‌నగర్ సెక్టార్ పరిధిలోని అజీజ్‌నగర్‌లో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. అజీజ్‌నగర్ గ్రామం, ఎస్సీ కాలనీలో కొనసాగుతున్నాయి. ఒకటో కేంద్రం గత సంవత్సరం జూలైలో అంగన్‌వాడీ టీచర్ ఆమె పదవికి రాజీనామా చేసింది. ఆయా పోస్టులు కూడా ఖాళీగానే ఉంది. దీంతో అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసి ఉంది. ఈ గ్రామాల్లో ప్రభుత్వాల ద్వారా వచ్చే బాలామృతం, గుడ్లు ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల లోపు పిల్లలకు నెలకు ఒకసారి తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంది. కానీ పక్కన ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు ఇన్‌చార్జీలుగా వచ్చి అందిస్తున్నారు. అధికారులు చొరవ తీసుకోని అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయా పోస్టులను నియమించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

టీచర్లను నియమించాలి



మండల పరిధిలోని ఎత్‌మార్‌పల్లి గ్రామంలో మూడు సంవత్సరాల నుంచి అంగన్‌వాడీ కేంద్రం తెరుచుకోవడం లేదు. దీంతో చిన్నారులు ఆటాపాటలు, విద్యాబుద్ధులకు దూరం అవుతున్నారు. ఖాళీగా ఉన్న ఆయా, టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.

– చింతకింది ప్రవీణ్‌రెడ్డి, ఎత్‌మార్‌పల్లి గ్రామస్తుడు.

ఇన్‌చార్జీలను ఏర్పాటు చేశాం

మండలంలోని ఎత్‌మార్‌పల్లి గ్రామంలో టీచర్‌గా కొనసాగుతున్న ఉపాధ్యాయురాలు రాజీనామా చేయడంతో ఆ స్థానం ఖాళీ అయింది. మూడు సంవత్సరాల నుంచి మూతబడిన మాట నిజమే. ఈ కేంద్రానికి ఇన్‌చార్జిగా తోల్‌కట్ట అంగన్‌వాడీ టీచర్‌ను నియమించాం. చిన్నపిల్లలు, బాలింతలకు ప్రభుత్వం ద్వారా వచ్చే పోషకాహారాలను 15 రోజులకొకసారి అందజేస్తున్నాం. ప్రభుత్వం టీచర్లు, సిబ్బందిని నియమించగానే ఏర్పాటు చేస్తాం.

– సునీత, సూపర్‌వైజర్, మొయినాబాద్